సాక్షి పెద్దపల్లి

7

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024

ప్రేమ పెళ్లిళ్లకు దేవుడే సాక్షి

శంకరపట్నం/మంథని: శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం ప్రేమ వివాహాలకు వేదికైంది. ఇక్కడి ఆలయంలో ఏటా 200కు పైగానే ప్రేమ వివాహాలు జరుగుతున్నాయి. ప్రేమ జంటలు పదోతరగతి సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డుతో పాటు నోటరీ, ఆరుగురు సాక్షులను వెంట తీసుకొస్తేనే అర్చకులు వివాహాలు జరిపిస్తున్నారు. వివాహ రిజిస్ట్రేషన్ రూపంలో రూ.5,116 చెల్లించాల్సి ఉంటుంది. మంథనిలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఏటా 15 నుంచి 20 వరకు ప్రేమ జంటలు ఏకమవుతున్నాయి.


మత్స్యగిరీంద్రస్వామి ఆలయం




మరిమడ్ల గ్రామం

కులాంతర వివాహాల 'మరిమడ్ల'

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల ప్రేమాలయంగా వర్ధిల్లుతోంది. ఆ ఊరి జనాభా నాలుగు వేలు. ఆ పల్లెలో దశాబ్దకాలంగా 30 జంటలు ఒక్కటయ్యాయి. కట్నాలు లేకుండా.. ఆదర్శ పెళ్లిళ్లు చేసుకున్నారు. అక్కడ కొట్లాటలు, గొడవలు, 'పరువు' హత్యలు కనిపించవు. ఈ ఊరిలో ప్రేమించుకున్న వాళ్లు ధైర్యంగా పెద్దలకు చెప్పి, పెళ్లి చేసుకుంటారు. ప్రభుత్వం జరిపించే కల్యాణమస్తు సామూహిక వివాహ వేదికలో నిజామాబాద్ జిల్లాకు చెందిన రవికుమార్‌తో ముంబయికి చెందిన రజిత వివాహాన్ని మరిమడ్ల వాసులు దగ్గరుండి జరిపించారు.

మనసుపడి.. ఏకమయ్యాం



ఒకరికి తెలియకుండా మరొకరం ప్రేమలో పడ్డాం. మాటలు కలిసి పరిచయం ప్రేమగా మారింది. ఆ ప్రేమను నిలబెట్టుకోవడానికి పెళ్లి చేసుకున్నాం. తొలుత ఇంట్లో వాళ్లు అభ్యంతరం చెప్పినా.. వారి మనసు మార్చి ఏకమయ్యాం. మేము కులాంతర వివాహం చేసుకున్నా సంతోషంగా ఉంటున్నాం.

– ఉల్లెందుల వంశీకృష్ణ, రేణుక

అర్థం చేసుకున్నాం



మా మధ్య పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుని పరస్పర అవగాహనతో జీవిస్తున్నాం. ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకోవడం సంతోషాన్ని ఇచ్చింది. జీవితంలో స్థిరపడి పెళ్లి చేసుకోవాలి.

– కుమ్మరి దిలీప్, శైలజ

పెద్దలు ఆమోదిస్తేనే



ప్రేమ పెళ్లిళ్లకు పెద్దల ఆమోదం పొందితేనే బాగుంటుంది. ఇల్లు విడిచిపోవడం, కష్టపడి ఇంటికి చేరడం బాగుండదు. ఏది ఏమైనా నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడం ఆనందమే. అయినవారి మధ్య ఆప్యాయంగా జీవించాలన్నదే మా లక్ష్యం.

– పుల్కం మల్లేశం, రజిత

న్యూస్‌రీల్

అధికారులకు ఆత్మీయ వీడ్కోలు


బదిలీపై వెళ్తున్న వారిని సత్కరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో సమర్థవంతంగా పని చేస్తూ అత్యుత్తమ సేవలు అందించారంటూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బదిలీపై వెళ్తున్న డీపీవో చంద్రమౌళి, డీఆర్‌డీవో శ్రీధర్, జెడ్పీ సీఈవో శ్రీనివాస్‌లను అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ ఇతర శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నిలిపి జాతీయస్థాయి గుర్తింపు వచ్చేలా అధికారులు కృషి చేశారన్నారు. ఆర్డీవో మధుమోహన్, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య పరీక్షలు


అడిషనల్ కలెక్టర్‌కు వైద్య పరీక్షలు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సీబీపీ, హిమోగ్లోబిన్, ఆర్‌బీఎస్, షుగర్, ఎల్‌ఎఫ్‌టీ ద్వారా కాలేయ పనితీరు, ఆర్‌ఎఫ్‌టీ ద్వారా కిడ్నీల పనితీరు, థైరాయిడ్ ప్రొఫైల్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలతో పాటు ఈసీజీ, కాల్షియం పరీక్షలు చేశారు. పరీక్షల్లో వచ్చిన ఫలితాలకు అనుగుణంగా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతీ అధికారి, ఉద్యోగ సిబ్బంది హెల్త్ ప్రొఫైల్ రూపొందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు.

53 మంది డ్రైవర్ల, క్లీనర్ల ఎన్నికల భత్యం విడుదల

జ్యోతినగర్: రామగుండం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సిబ్బందిని పోలింగ్ బూత్‌లకు తరలించిన బస్సు యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లకు భత్యం విడుదలైంది. ఈనెల 8న 'సాక్షి'లో 'డ్రైవర్లకు ఎన్నికల భత్యం అందేది ఎప్పుడో' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నియోజకవర్గంలోని 53 మంది డ్రైవర్లు, క్లీనర్లు, వాహన యజమానులకు రావాల్సిన రూ.3,74,460 ఖాతాలో జమచేశారు. దీంతో ఎన్నికల భత్యం విడుదల చేసిన రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ, ఎంపీఏ భీమ్‌సింగ్‌తో పాటు సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రేమ రెండక్షరాలు.. రెండు హృదయాలు.. ఇద్దరు మనుషులు.. ప్రేమ.. ఒక ధైర్యం.. ఒక సాహసం.. ప్రేమ అనిర్వచనీయం... చూపులు కలిసి.. మనసులు ఒక్కటై జీవిత భాగస్వాములుగా కలకాలంగా జీవించేందుకు పునాది వేస్తుంది. ఆ జీవన ప్రయాణంలో ఏళ్లు గడిచినా.. ఇంకా కొత్తగానే అనిపిస్తుంది. ఆ మధుర స్మృతులను కలకాలం గుర్తుండేలా చేస్తుంది. ఇలా.. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాకు చెందిన పలువురు ప్రేమ పెళ్లిళ్లు చేసుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు. క్లాసురూముల్లో మొదలైన ప్రేమను కలకాలం నిలుపుకుని ఆనందంగా గడుపుతున్నారు. ప్రేమ ఎంత మధురమో.. జీవితంలో స్థిరపడడం అంతే ముఖ్యమంటూ సూచిస్తున్నారు. ప్రస్తుత టీనేజీ యువత ఆకర్షణను ప్రేమ అనుకుంటూ.. జీవితంలో దారి తప్పుతున్నారని పలువురు హెచ్చరిస్తుండగా.. స్వచ్ఛమైన ప్రేమ కలకాలం నిలుస్తుందని మరికొందరు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు ఆలయాలు ప్రేమ పెళ్లిళ్లకు వేదికగా నిలవగా.. కొన్ని లవ్‌స్పాట్స్ వారి స్వీట్ మెమొరీస్‌కు వేదికవుతున్నాయి. నేడు ప్రేమికుల దినోత్సవంగా సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు..!!

ప్రేమ ఎంత మధురం

- రెండక్షరాలు.. నూరేళ్ల జీవితం
- పోరాడి గెలిచినవారు కొందరు..
- ప్రేమకోసం జీవితాన్ని గెలిచిన వారు ఇంకొందరు
- ఉమ్మడి జిల్లాలో ఆదర్శ ప్రేమికులు ఎందరో..
- నేడు ప్రేమికుల దినోత్సవం



అల్లునూర్ అబ్బాయి.. శ్రీలంక అమ్మాయి

తిమ్మాపూర్: చదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లిన అల్లునూర్ అబ్బాయి.. శ్రీలంక అమ్మాయి మధ్య ప్రేమ చిగురించింది. ఆ ప్రేమను పదేళ్లు నిలుపుకుని, పెద్దలను ఒప్పించి పెళ్లి పీటలెక్కారు. తిమ్మాపూర్ మండలం అల్లునూర్‌కు చెందిన అరుణ్‌కుమార్ ఇంజినీరింగ్ పూర్తిచేసి పైచదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లాడు. శ్రీలంకలో డిగ్రీ చదివిన అజ్జారా.. ఎంబీఏ చదివేందుకు ఆస్ట్రేలియా వెళ్లింది. 2014లో ఇద్దరూ పరిచయమయ్యారు. వారిమధ్య ఏర్పడిన స్నేహం క్రమంగా ప్రేమగా మారింది. ఆ ప్రేమను పెద్దలు అంగీకరించేందుకు చాలా సమయం పట్టింది. ఆలస్యమైనా పదేళ్లు నిరీక్షించారు. చివరకు తల్లిదండ్రులు వారి ప్రేమలోని నిజాయితీని గుర్తించి అంగీకరించారు. పెద్దల అంగీకారంతో అజ్జారాతోపాటు ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను తీసుకుని అల్లునూర్‌కు వచ్చాడు అరుణ్‌కుమార్. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో హిందూ వివాహ చట్టం ప్రకారం గత డిసెంబర్‌లో వివాహంతో ఒక్కటయ్యారు. ఇక జనవరిలో ఈ జంట శ్రీలంక వెళ్లింది. వధువు కుటుంబసభ్యులు బౌద్ధులు కావడంతో అక్కడ ఇద్దరూ మరోమారు బౌద్ధ సంప్రదాయం ప్రకారం ఒక్కటయ్యారు.

ఎల్లలు దాటిన ప్రేమ

శాలపల్లి అబ్బాయి.. నేపాల్ అమ్మాయి.



గొల్లపల్లి: జిల్లాలోని పెగడపల్లి మండలం శాలపల్లి గ్రామానికి చెందిన కొండి వెంకటి–లక్ష్మి దంపతుల కొడుకు రవి ఆరేళ్లుగా దుబాయ్‌లో ఉంటున్నాడు. అక్కడే పనిచేసే నేపాల్‌కు చెందిన చంద్రమయ రాయ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మూడేళ్లక్రితం ఇరు కుటుంబాలను ఒప్పించి దుబాయ్‌లో పెళ్లి చేసుకున్నారు. ఏడాది క్రితం వీరికి కుమారుడు జన్మించాడు. ప్రేమ, అనుబంధాలకు భాష, సరిహద్దులు అడ్డురావని రవి–చంద్రమయ రాయ్ చెబుతున్నారు.

భీమవరం అమ్మాయి.. గొల్లపల్లి అబ్బాయి



గొల్లపల్లి: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బొమ్మెన లక్ష్మణ్ హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగి. అక్కడే ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరానికి చెందిన సత్యవల్లితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో 10ఏళ్లక్రితం వారిని ఎదురించి వివాహం చేసుకున్నారు. 'ఇప్పటికీ తన పేరెంట్స్ తనతో మాట్లాడరు. పెళ్లి తర్వాత చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. తాను నాకు ఒక సపోర్టర్‌గా, మోటివేటర్‌గా నిలబడింది. ఇప్పుడు మాకు ఇద్దరు పిల్లలు. ఎన్నో ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు, కష్టాలు, నష్టాలు వచ్చినా కలిసి పోరాడి నిలబడ్డాం. ఇప్పుడు హైదరాబాద్‌లో సొంత ఇల్లు తీసుకుని నిలబడ్డాం. అన్నింటికీ ఆ దేవుడు తోడుగా ఉండి కాపాడుతున్నాడని బలంగా నమ్ముతాం'.. అని లక్ష్మణ్ వివరించారు.

ప్రేమ.. ఉద్యోగం.. పెళ్లి



బుగ్గారం: మాది ప్రేమ వివాహం. నేను నా భార్య హారికరెడ్డి ఒకే పాఠశాలలో చదువుకున్నాం. పక్కపక్క గ్రామాలు కావడంతో పరిచయం పెరిగింది. కాలేజీ రోజులలో ప్రేమగా మారింది. పెద్దలకు తెలిసినా జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకోవాలని సలహా ఇచ్చారు. అప్పటికి నేను కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. తను బీఈడీ చదువుతోంది. కొద్దిరోజులకు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. రెండేళ్లకు నేను ఎస్సైగా ఎంపికయ్యాను. ఇటీవలే పెళ్లిబంధంతో ఒక్కటయ్యాం. ఇప్పుడు ఇద్దరం ఒకే నియోజకవర్గంలో ఉద్యోగాలు చేస్తున్నాం. ప్రేమ ఎంత ముఖ్యమో కెరియర్ అంతే ముఖ్యమని యువత గుర్తించాలి.

– శ్రీధర్‌రెడ్డి, ఎస్సై బుగ్గారం, జగిత్యాల జిల్లా

కాలేజీలోనే ప్రేమలో..



పెద్దపల్లిరూరల్: మాది పెద్దపల్లి. ఎంబీఏ చదువుతున్న రోజుల్లో సమీరాతో పరిచయం ఏర్పడింది. ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకోవాలనుకున్నాం. మతాంతర వివాహం కావడంతో ఇరు కుటుంబాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినా పెద్దలను ఒప్పించి పెళ్లి 2020 మార్చి2న పెద్దల సమక్షంలోనే పెళ్లి చేసుకున్నాం. మాకు మహావీర్ రాణప్రతాప్ అనే నాలుగేళ్ల బాబు ఉన్నాడు. సమీర ప్రస్తుతం జర్నలిజం చదువుతోంది. నేను పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రజాసేవలో ఉన్నా.

– రాజం మహంతకృష్ణ, పెద్దపల్లి

డాక్టర్ లవర్స్..



జమ్మికుంట: నా పేరు కన్నవేన తిరుపతి. సొంతూరు జమ్మికుంట మండలం మాచనపల్లి. కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సు చదువున్న సందర్భంలో హైదరాబాద్ మల్కాజిగిరికి చెందిన కె.స్వర్ణలతలో పరిచయం ఏర్పడింది. మొదట స్నేహితులుగా ఉన్నాం. తరువాత ప్రేమగా మారింది. 2015లో పీజీ చదువుతుండగా పెళ్లి చేసుకోవాలని అనుకున్నాం. ఇరు కుటుంబాల అంగీకారంతో 2017లో వివాహం చేసుకున్నాం. ఇప్పుడు మాకు ముగ్గురు పిల్లలు. 2020 నుంచి జమ్మికుంటలో ఓ ఆస్పత్రి నెలకొల్పి వైద్య సేవలు అందిస్తున్నాం.

– కన్నవేన తిరుపతి, జమ్మికుంట

కొండగట్టులో కలిశాం..



మానకొండూర్ రూరల్: మాది మానకొండూర్. పదేళ్లక్రితం ఒకరోజు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లాను. అక్కడికి బెల్లంపల్లికి చెందిన భారతి కూడా వచ్చింది. దైవ సన్నిధిలో మా మనసులు కలిశాయి. పరిచయం ప్రేమగా మారింది. ఇరువురి కులాలు వేరు కావడంతో ఇంట్లో పెద్దలు ఒప్పుకోలేదు. నాలుగేళ్లు ఎదురుచూసి ఒప్పించి, వివాహం చేసుకున్నాం.

– జి.శేఖర్, మానకొండూర్

పెద్దలు వద్దన్నా...



కాల్వశ్రీరాంపూర్: మాది కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట. సమీప మొట్లపల్లికి చెందిన సుజాతతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అయితే మా ప్రేమకు బీజం పడింది మాత్రం మహారాష్ట్రలో. మా పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. స్నేహితుల సాయంతో ఓ ఆలయంలో వివాహం చేసుకున్నాం.

– పెద్ది రాజు, కిష్టంపేట

పత్తి రైతుకు దక్కని 'మద్దతు'!

- ధర తగ్గించారంటూ రైతుల నిరసన
- రోడ్డెక్కేందుకు యత్నం.. బుజ్జగించిన అధికారులు
- రాత్రి వరకు సాగిన కొనుగోళ్లు


ఈ ఫొటోలోని మహిళా రైతులు దాడి వినోద, భాగ్యమ్మ, కొత్త పద్మ. ధర్మారం మండలం రామయ్యపల్లి నుంచి పెద్దపల్లి మార్కెట్‌యార్డుకు పత్తిని తీసుకొచ్చారు. తెచ్చిన పత్తి కొనేందుకు వ్యాపారులు రూ.3వేలకే క్వింటాల్ ధర నిర్ణయించారు. గిట్టుబాటు ధర కోసం పొద్దున్నుంచి మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్నారు. గిట్లయితే మా కష్టమంతా ఏడపోవాలె. అధికారులే న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.


మంగళవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పత్తి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం పత్తి పోటెత్తింది. జిల్లాలోని పలు గ్రామాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో పత్తి నిల్వలను మధ్యాహ్నం వరకు తెస్తూనే ఉన్నారు. పత్తి కొనుగోలు దారులు పత్తి నాణ్యతను పరిశీలించి తేమ శాతం ఎక్కువగా ఉందంటూ క్వింటాల్ ధరను ఈ సీజన్‌లో ఎప్పుడూ లేనంత తక్కువగా రూ.3వేల నుంచే రూ.4వేల వరకు కొనేందుకు ముందుకు రావడంతో సమస్య తలెత్తింది. వ్యాపారులు తక్కువ ధరను నిర్ణయించారంటూ రోడ్డెక్కి నిరసన చేసేందుకు బయల్దేరారు. రైతులు నిరసన వ్యక్తం చేసేందుకు యత్నిస్తున్నారని గ్రహించిన అధికారులు పోలీసులకు సమాచారమిచ్చి రైతులను సముదాయించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న ఎస్సై మల్లేశ్, ఏఎస్సై రామస్వామిలు రోడ్డెక్కితే సమస్య పరిష్కారం కాదంటూ రైతులతో బుజ్జగించారు. మార్కెట్ అధికారులు నాణ్యతను బట్టి ధర పెంచుతారని తెలిపారు.

మార్కెట్ సందర్శనకు వచ్చిన జేడీ

పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్ల తీరును పరిశీలించేందుకు వరంగల్ జేడీ మల్లేశం మంగళవారం మార్కెట్‌ను సందర్శించారు. పత్తి రైతుల ఆందోళనను గమనించి వారితో మాట్లాడారు. తేమ శాతాన్ని పరిశీలించాలని మార్కెట్ కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్, డీఎంఓ ప్రవీణ్‌రెడ్డిలకు సూచించారు. 18శాతం నుంచి 25శాతం వరకు ఉన్నట్లు గ్రహించారు. నీళ్లు పోసి పత్తి నాణ్యతను దెబ్బతీయొద్దని రైతులకు సూచించారు. నాణ్యతను బట్టి ధర ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. అయినా రైతులు ధర చాలా తక్కువగా నమోదైందని ఆందోళన వ్యక్తం చేయడంతో వ్యాపారులను పిలిపించి కొంత మొత్తాన్ని పెంచాలని సూచించారు.

తమకు నష్టమంటున్న వ్యాపారులు

పత్తి నాణ్యతగా ఉంటే ధర పెంచి ఇచ్చేందుకు అభ్యంతరం లేదని, నీళ్లు పోసి తెచ్చిన పత్తి నాణ్యత లేకున్నా కొనుగోలు చేస్తే తాము నష్టపోవాల్సి వస్తుందని వ్యాపారులు అధికారులకు తేల్చి చెప్పారు. అధికారులు వ్యాపారులను నచ్చజెప్పి కొంత మొత్తం పెంచేలా చూడడంతో రైతులు శాంతించారు. దీంతో కొనుగోళ్లు యథావిధిగా సాగాయి. తూకంరాత్రి దాకా సాగింది.

తక్కువ ధరకు కొంటమంటుండ్రు



మార్కెట్‌లో మద్దతు ధరకు అమ్ముకుందామని తెచ్చిన పత్తి మంచిగ లేదంటూ తక్కువ ధరకే కొంటమన్నరు. ఎన్నడు లేనంత తక్కువకు కొనుడేందని లొల్లి చేసినం. మార్కెట్ సార్లు వచ్చి సముదాయించి కొంత పెంచుతమన్నరు.

– గాదె చంద్రయ్య, కమాన్‌పూర్

నాణ్యత ఉంటేనే మద్దతు ధర



రైతులు నాణ్యమైన పత్తిని తెచ్చి మద్దతు ధర పొందాలి. నీళ్లు చల్లితే పత్తి నాణ్యత పాడవుతుంది. తేమ శాతాన్ని బట్టి ధర ఉంటుంది. రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యాపారులు వ్యవహరిస్తే అధికారులు చూస్తు ఊరుకోరు. రైతులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలి.– మల్లేశం, మార్కెటింగ్ జేడీ

సమ్మక్క జాతర ఎఫెక్ట్

సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తుండడంతో రైతులు తమ వద్ద ఉన్న పత్తి నిల్వలను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తరలివచ్చారు. మంగళవారం 405మంది రైతులు 1,912 క్వింటాళ్ల పత్తిని యార్డుకు తెచ్చినట్లు మార్కెటింగ్ అధికారులు తెలిపారు. సమ్మక్క జాతర ఖర్చుల కోసం పత్తి తెస్తే ధర తక్కువ కావడంతో ఖంగుతిన్న రైతులు నిరసనకు దిగడంతో కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,612కు చేరింది. గరిష్ట ధర రూ.6,744గా సరాసరి ధర రూ.6,488గా పలికిందని అన్నారు.

పెద్దల పెళ్లికే జై..

- జీవితం సాఫీగా సాగాలంటే తల్లిదండ్రుల మద్దతు కీలకం
- అటు ప్రేమ.. ఇటు పెద్దల ఆప్యాయత తప్పనిసరి అంటున్న యువత
- వాలంటైన్స్‌డే సందర్భంగా 'సాక్షి' డిబెట్‌లో యువతీయువకుల మనోగతం

సాక్షి, పెద్దపల్లి: 'ప్రేమించుకోవడం గొప్ప కాదు.. తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకొని జీవితంలో నెగ్గడం గొప్ప' అంటుంది నేటి యువతరం. పెద్దల అంగీకారంతో చేసుకునే వివాహమే సాఫీగా సాగుతుందని, ఆనందంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. బుధవారం ప్రపంచవ్యాప్తంగా వాలంటైన్స్‌డే జరుపుకుంటున్న సందర్భంగా పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన డిబేట్‌లో విద్యార్థిని విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. లవ్ మ్యారేజ్‌లతో వరకట్నం, కుల నిర్మూలన లాంటి సమస్యలకు పరిష్కారం చూపుతుందని కొంతమంది అభిప్రాయపడగా, జీవితంలో స్థిరపడిన తర్వాతే ప్రేమ పెళ్లి, పెద్దలు కుదిర్చిన పెళ్లి అయినా చేసుకోవాలని తమ మనోగతాన్ని వెలిబుచ్చారు.

సాక్షి టాక్ షో

భవిష్యత్ బాగుంటుంది



తల్లిదండ్రులను బాధ పెట్టకుండా పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంటే భవిష్యత్ బాగుంటుంది. పెళ్లి సమయంలో ఇద్దరూ ఒకరికి ఒకరు పూర్తిగా తెలిసిన తర్వాత వివాహ బంధానికి వెళ్తే బంధం బలంగా ఉంటుంది. ఎదైనా సమస్యలు వచ్చినా ఒకరికొకరు అర్థం చేసుకోగలుగుతారు.

– దేవాంతి, బీకాం ఫైనల్ ఇయర్

అరెంజ్ మ్యారేజ్‌తో హ్యాపీ



జీవితం సాఫీగా సాగాలంటే అరెంజ్ మ్యారేజ్ బెటర్. కుటుంబసభ్యులు ఒప్పుకోకపోయినా పెళ్లి చేసుకుంటే భవిష్యత్‌లో ఆర్థికంగా, హెల్త్ సమస్యలు వచ్చినప్పుడు ఎవరూ సపోర్టుగా నిలవరు. అదే పెద్దలు కుదిర్చిన పెళ్లిలో ఇటువంటి ఇబ్బందులు తలెత్తితే కుటుంబం మనకు అండగా నిలుస్తోంది.

– అఖిల, బీకాం ఫైనల్ ఇయర్

మాయలో పడొద్దు



చదువుకునే వయస్సులో సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో ప్రేమ అంటూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. సినిమాల్లో చూపించినట్లు నిజజీవితంలో ఉండదు. లాజికల్‌గా ఆలోచించాలి. ఆర్థిక స్వాతంత్రం, పరిణితి, సక్సెస్ సాధిస్తే జీవితం పూలబాట అవుతుంది.

– శ్రీనివాస్, గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్

లైఫ్, కెరీర్‌ను లవ్ చేయండి



ప్రేమకు ఇష్టానికి తేడా ఉంటుంది. విద్యార్థి దశలో సహజంగా కలిగే ఆకర్షణలకు లోనుకాకుండా లైఫ్, కెరీర్‌ను లవ్ చేయాలి. జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగి స్థిరపడితే అన్ని మీ దగ్గరకే వస్తాయి. తల్లిదండ్రులే మీరు నచ్చిన వారితో వివాహం జరిపిస్తారు. పెద్దలు కుదిర్చిన పెళ్లి తర్వాత సైతం లవ్ చేయవచ్చు.

– రజనీదేవి, కరస్పాండెంట్

అవగాహన, నమ్మకం ముఖ్యం



ప్రేమ, పెళ్లిపై అవగాహన, నమ్మకం ఉండాలి. కుటుంబ పరిస్థితులను తెలుసుకొని ఒకరినొకరు అర్థం చేసుకుని ముందుకు సాగితే ఇబ్బందులైనా ఎదుర్కొనవచ్చు. అప్పుడే భవిష్యత్‌పై పెట్టుకున్న ఆశలు నెరవేరుతాయి.

– రాకేశ్, బీఎస్సీ ఫైనల్ ఇయర్

పెద్దల పెళ్లి బెటర్



ప్రేమించి పెళ్లి చేసుకోవాలన్నప్పుడు అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులను ఒప్పించుకోవాలి. జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటే సమస్య ఉండదు. పెద్దలు కుదిర్చిన పెళ్లి అయితే ఏదైన సమస్యలు వచ్చినా చర్చించి పరిష్కరిస్తారు.

– పరిమళ, బీఎస్సీ ఫైనల్ ఇయర్

ప్రేమ పెళ్లి మంచిదే..



ప్రేమించి పెళ్లి చేసుకోవడం మంచిదే. ఎందుకుంటే ముందుగానే ఒకరినొకరు అర్థం చేసుకుని ముందుకు సాగుతారు. జీవితంలో స్థిరపడిన తర్వాతే ప్రేమించాలి. అప్పుడే తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంతోషంగా ఉంటారు.

– అరవింద్, బీఎస్సీ ఫైనల్ ఇయర్

కట్నం సమస్యలకు చెక్



సమాజంలో పేద తల్లిదండ్రులు అరేంజ్ మ్యారేజ్‌లో అడిగినంత కట్నం ఇవ్వలేక ఇబ్బంది పడుతున్నారు. అప్పుల పాలవుతున్నారు. ప్రేమ వివాహాలతో సమాజంలో కొంత వరకట్న సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

– అభిషేక్, బీకాం ఫైనల్ ఇయర్

క్లుప్తంగా

రాజన్న సేవలో మురళీధర్‌రావు



వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఉన్నారు.

కన్న కొడుకు పట్టించుకోవడం లేదని..

- ఆర్డీవో కార్యాలయం మెట్లెక్కిన వృద్ధురాలు

జగిత్యాలటౌన్: ఇంటితోపాటు ఆస్తులు మొత్తం లాక్కుని ఇంటి నుంచి వెళ్లగొట్టిన తన కుమారుడు ముస్తాఫాఖాన్‌పై చర్యలు తీసుకోవాలని రాయికల్ మండల కేంద్రానికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు నయీమున్నీసాబేగం మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన భర్త స్వార్జితమైన ఇంటితో పాటు 5తులాల బంగారం, 30 తులాల వెండిని లాక్కుని ఇంటినుంచి వెళ్లగొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొడుకు పట్టించుకోకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఆర్డీవో కార్యాలయానికి వచ్చానని ఆవేదన వ్యక్తం చేశారు. తన పోషణ బాధ్యత కొడుకు చూసుకునేలా ఆదేశించాలని కోరారు.

ఎల్లంపల్లిలో తగ్గుతున్న నీటిమట్టం

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది పంపుహౌస్ ద్వారా ఎత్తిపోతలు ప్రారంభించడంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.58 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. ప్రాజెక్టులోకి ఎలాంటి ఇన్‌ఫ్లో లేకపోగా గూడెం పంపుహౌస్ నుంచి 145 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్‌కు 312 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 242 క్యూసెక్కులు, నంది పంపుహౌస్ నుంచి 3,150 క్యూసెక్కులు, మొత్తంగా ప్రాజెక్టు నుంచి 3,849 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉంది.

ప్రభుత్వరంగ సంస్థల రక్షణ కోసం ఉద్యమిద్దాం



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జ్యోతినగర్: ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించేందుకు కార్మికవర్గం ఉద్యమిద్దామని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికవర్గానికి తీరని ద్రోహం చేసిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా జీవోలను సవరించకుండా నిర్లక్ష్యధోరణి అవలంభిస్తుందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమ్మె కరపత్రాలను కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, నాగభూషణం, భూమయ్య, రాజమల్లయ్య, లక్ష్మణ్, సత్యనారాయణ, సత్యం, శ్రీనివాస్, చింతల సత్యం తదితరులు పాల్గొన్నారు.

పునరాలోచనలో జగిత్యాల కౌన్సిలర్లు

- నేటి అవిశ్వాస సమావేశం లేనట్లేనా..?
- హైదరాబాద్‌కు తరలిన కౌన్సిలర్లు
- చైర్మన్ పదవి కోసం వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం
- ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీలు కవిత, రమణతో సమావేశం



కౌన్సిలర్లతో సమావేశమైన ఎమ్మెల్సీలు కవిత, రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు.. వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెల్సిందే. ఆ మేరకు కలెక్టర్ యాస్మిన్ బాషా నోటీసులు జారీ చేశారు. ఈనెల 14న (బుధవారం) ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఇంతలోనే కౌన్సిలర్లు పునరాలోచనలో పడ్డారు. అవిశ్వాసం పెడితే ఏం జరుగుతుందోనన్న ఆందోళన వారిలో మొదలైంది. ఒకవేళ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గినా.. చైర్‌పర్సన్ లేకుండా వైస్ చైర్మన్ ఎన్నిక చేపట్టలేమని అధికారులు స్పష్టం చేయడంతో చేసేదేమీలేకే కౌన్సిలర్లు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఒకవేళ వైస్ చైర్మన్ పదవి పోతే ప్రత్యేక అధికారి వస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలుంటాయని, వైస్ చైర్మన్‌తోనే నెగ్గకొద్దామనే ఉద్దేశంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది. మరోవైపు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా రాయికల్, జగిత్యాల మున్సిపాలిటీల కౌన్సిలర్లతో సమావేశమై అవిశ్వాసం ఉండొద్దని చెప్పడంతో కౌన్సిలర్లు మిన్నకుండిపోయారు.

చైర్మన్ సీటు కోసం ప్రయత్నం

వాస్తవానికి జగిత్యాల మున్సిపల్ చైర్మన్ పదవి ఈసారి బీసీ మహిళకు రిజర్వేషన్ అయ్యింది. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ నుంచి బోగ శ్రావణి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. సమిండ్ల వాణి, బండారు రజిని, జ్యోతి తదితరులు పోటీపడినా అధిష్టానం శ్రావణివైపే మొగ్గుచూపింది. అయితే కొన్ని రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏడాది క్రితం శ్రావణి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. చైర్‌పర్సన్ సీటు ఖాళీ కావడంతో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. కొద్ది రోజులు పావులు కదిపినా అసెంబ్లీ ఎన్నికలు రావడంతో జాప్యం జరిగింది. ఇటీవల వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి చైర్మన్ పదవిని దక్కించుకుందామని బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లే ఎత్తుగడ వేశారు. 29 మంది కౌన్సిలర్లు జనవరి 16న జిల్లా అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస పత్రం అందించారు. వెంటనే కలెక్టర్ ఫిబ్రవరి 14న సమావేశం నిర్వహించనున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చారు. అప్పటి నుంచి వైస్ చైర్మన్ పదవినైనా దక్కించుకోవాలని కౌన్సిలర్లు క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వైస్ చైర్మన్ పదవి పోతే.. చైర్మన్ లేడు కాబట్టి కచ్చితంగా ప్రత్యేకాధికారి పాలన వస్తుందని నిపుణులు పేర్కొనడంతో చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. 2019 మున్సిపల్ యాక్ట్‌ప్రకారం వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవాలంటే చైర్‌పర్సన్ పదవీ తప్పకుండా ఉండాలి. జగిత్యాల మున్సిపాలిటీ బీసీ మహిళకు కేటాయించినా.. అగ్రకులస్తుడైన శ్రీనివాస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగడంతో సొంత పార్టీ కౌన్సిలర్ల నుంచే విమర్శలు వచ్చి అవిశ్వాసానికి వెళ్లారు. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఉండాల్సిందే తప్ప చేసేదేమీలేదు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ తీసుకుని కౌన్సిలర్లతో సమావేశమై అవిశ్వాసానికి పోవద్దని సూచించినట్లు తెలిసింది.

అవిశ్వాసం నెగ్గితే స్పెషల్ ఆఫీసర్ పాలనే

ఒకవేళ అవిశ్వాసం నెగ్గితే స్పెషల్ ఆఫీసర్ పాలన వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పట్లో చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే బోగ శ్రావణి తన పదవికి రాజీనామా చేయగా ఖాళీ అయిన కౌన్సిలర్ పదవికి ముందుగా ఎన్నిక జరగాలి. ఆ ఎన్నిక ఇప్పటివరకు నిర్వహించలేదు.

కౌన్సిలర్ల సమావేశం

వైస్ చైర్మన్‌తోసహా బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత ఇంట్లో సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని, రానున్న కాలంలో పార్టీ మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని, బీఆర్‌ఎస్ పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని కవిత స్పష్టం చేసినట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానంపై పునరాలోచన చేయాలని సూచించిన ట్లు తెలిసింది. దీంతో కౌన్సిలర్లు ఓటింగ్‌లో పాల్గొనబోమని ప్రకటించినట్లు తెలిసింది. వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ ఆధ్వర్యంలో మంతనాలు జరిపి అవిశ్వాసం లేకుండా చూశారు. ఇటీవల రాయికల్ మున్సిపాలిటీలోనూ అవిశ్వాస తీర్మానానికి తెరలేపగా.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ తీసుకుని అవిశ్వాసం లేకుండా చూశారు.

దమ్ముంటే అవినీతి బయట పెట్టండి

- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు
- అవిశ్వాసం వీగినా కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు



మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: కూతురు పెళ్లిరోజు అని చూడకుండా చైర్మన్ పదవిపై అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసం వీగిన తర్వాత బ్లాక్ మెయిల్ చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ఆరోపణలు చేస్తున్నారు, దమ్ముంటే అవినీతి బయటపెట్టాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని స్వగృహంలో మాట్లాడారు. ఇటీవల ఓ వివాహ వేడుకల్లో ఓ కౌన్సిలర్ మాట్లాడుతుండా ప్రజలు చూస్తే బాగుండదని వారించానని, దీంతో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాడని అన్నారు. అవిశ్వాసం సమయంలో రూ. 5లక్షల తీసుకొని మద్దతు ఇస్తానని మోసం చేశాడ, ఆధారాలు సైతం ఉన్నాయన్నారు. కౌన్సిలర్లు అడిగినంత డబ్బు ఇవ్వనందుకే నాపై అవిశ్వాసం పెట్టారు. కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరి అధికార పార్టీ , ప్రభుత్వం పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అవినీతిని నిరూపించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత అవసరాల కోసం పార్టీలు మారుతారు, వ్యక్తిగత కక్షల కోసం హత్యాయత్నాలు చేసింది ఎవరో అందరికీ తెలుసని అన్నారు. కేసు నుండి తప్పించుకునేందుకు అధికారం ఉన్న పార్టీలో చేరుతున్నారని, పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుంది ప్రజలు గమనిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు జుగురు సదానందం, శ్రీపతి నరేశ్, పాతకాల రమేశ్, దయ్యాల శ్రీనివాస్, నాయకులు బోగం వెంకటేశ్, దిలీప్, మంద రాజేశ్, ఎండీ జానీ, పర్లపల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గీత కార్మికుడి మృతి



అయిలయ్య(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని రూపునారాయణపేటకు చెందిన గీత కార్మికుడు అరెల్లి అయిలయ్యగౌడ్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. అయిలయ్యకు ఛాతిలో అకస్మాత్తుగా నొప్పిరావడంతో కుటుంబసభ్యులు 108లో చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

పెద్దపల్లి వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీధర్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఊట్ల శ్రీధర్‌కు రాజస్థాన్‌లోని జేజేటీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీలో సోమవారం జరిగిన 12వ కాన్వకేషన్ కార్యక్రమంలో పశ్చిమబెంగాల్, జార్ఖండ్ గవర్నర్లు ఆనందబోస్, రాధాకృష్ణన్, వైస్‌ఛాన్స్‌లర్, వైస్‌ఛాన్స్‌లర్‌ల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు శ్రీధర్ తెలిపారు. శాటిలైట్ ఇమేజ్ రంగంపై చేసి పరిశోధనతో పాటు దాని ప్రాసెసింగ్ ప్రభావం వాతావరణంపై సాధ్యాసాధ్య మెలకువలను తెలుసుకోవచ్చన్నారు. ఈ అంశంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన పత్రాలు సమర్పించి ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లు తెలి పారు. పెద్దపల్లిలోని ట్రినిటీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న శ్రీధర్‌ను మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ట్రినిటీ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశ్ అభినందించారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- జస్టిస్ చంద్రయ్య



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య

గోదావరిఖనిటౌన్: మానవ హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అన్నారు. మంగళవారం గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కుల పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారయ్యతో కలిసి పాల్గొని మాట్లాడారు. మానవహక్కుల పరిరక్షణ తీర్మాణం 1948లో ప్రారంభమైందన్నారు. పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ మానవ హక్కుల రక్షణ కోసం కృషి చేయాలన్నారు. అనంతరం న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్, ఒకటవ అదనపు మెజిస్ట్రేట్ దుర్గం గణేశ్, ఏపీపీ నంది రవీందర్, కమిటీ సభ్యులు గోసిక ప్రకాష్, ప్రదీప్ కుమార్, అనురాధ, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో పలువురి అరెస్టు

కొత్తపల్లి: ప్రేమ పేరుతో వెంబడించి వేధింపులకు గురిచేస్తున్నాడనే అనుమానంతో మండలంలోని చింతకుంటకు చెందిన ఎండీ అక్బర్‌ను ఆదివారం కిడ్నాప్ చేసిన పలువురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. కరీంనగర్‌లోని బుట్టిరాజరాంపల్లి కాలనీకి చెందిన సమీర్, ఆయుబ్‌పాషా, తాజ్, అహ్మద్, ఖాజాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చికెన్ వ్యర్థాలు అమ్మితే చర్యలు

పెద్దపల్లిరూరల్: చికెన్ సెంటర్‌లలో అపరిశుభ్రంగా ఉన్నా, చికెన్ వ్యర్థాలు అమ్మినా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ అన్నారు. మంగళవారం చికెన్ సెంటర్ల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చికెన్ అమ్మేందుకు లైసెన్సులు పొందాలని, చికెన్ విక్రయించే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇక నుంచి తనిఖీలు నిర్వహిస్తామని అపరిశుభ్రంగా ఉంటే జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఎస్సై మల్లేశ్ మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలను ఇటుకబట్టీ కూలీలు, పేదలకు అమ్మితే సదరు యజమానులపై క్రిమినల్ కేసులు, పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, మేనేజర్ శివప్రసాద్, ఏఎస్సై రామస్వామి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని మార్కండేయకాలనీకి చెందిన చెల్లు రమేశ్(33) మంగళవారం రైల్వే లైన్ విద్యుత్ వైర్లను ముట్టుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వినీత, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్‌కు ఎనిమిదేళ్ల క్రితం స్రవంతి అనే మహిళతో వివాహమైంది. ఇప్పటివరకు పిల్లలు కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం తాగి ఇంటికి వచ్చిన రమేశ్ తన తల్లితో తనకు పిల్లలు కావడం లేదని చెప్పుకుంటూ బ్రతకం వృథాఅని, చనిపోతా అంటూ ఇంటి నుంచి వెళ్లాడు. సమీపంలోని రైల్వే లైన్‌లోని కరెంట్ పోల్ ఎక్కి వైర్లను ముట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడ్డాడు. కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఎస్సై వినీత తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



గోదావరిఖని: గోదావరి తీరంలోని సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జాతర ప్రాంగణాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ప్రత్యేక బారీకేడ్స్, స్నానఘట్టాలు తదితర ఏర్పాట్లు చేయాలని అన్నారు. గోదావరినదిలో నీరు నిండుగా ఉండటం వల్ల ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జీఎం వెంట సివిల్ ఏజీఎం నాగేశ్వర్‌రావు, వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్, డీవైఎస్సీ వసంత్‌కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, జాతర కమిటీ సభ్యులున్నారు.

యువకుడి బలవన్మరణం

వెల్గటూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తాళ్లకొత్తపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎలకటూరి లక్ష్మీనారాయణ (35) భవన నిర్మాణ కూలీ. కొద్దికాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. లక్ష్మీనారాయణకు భార్య సౌందర్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

అటవీశాఖ అధికారులకు మొసలి అప్పగింత

రాయికల్: రాయికల్ మండలం దావన్‌పల్లి గ్రామంలోని కుర్ర శేఖర్ అనే రైతు వ్యవసాయ బావిలో మంగళవారం మొసలి కనిపించింది. గమనించిన రైతులు, గ్రామస్తులు మొసలిని పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్‌ఆర్ విజయ ఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సార్ జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి, ప్రిన్సిపాల్‌లు

- విద్యార్థులను అభినందించిన జోనల్ ఇన్‌చార్జి తిరుపతి

తిమ్మాపూర్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కరీంనగర్ ఎస్‌ఆర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మంగళవారం అలుగునూర్‌లోని కాలేజీ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి మాట్లాడారు. కాలేజీకి చెందిన తొమ్మిది మంది విద్యార్థులు 90 శాతంపైగా మార్కులు సాధించారని వివరించారు. ప్రతీ పోటీ పరీక్షల్లో ఏటా ఎస్సార్ కాలేజీ విజయ ఢంకా మోగిస్తోందన్నారు. జి.రాజీవ్ 99.20 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, శ్రీవాస్తవ 98.5 శాతం, వినూత్న 98.22, రిషిత్ 98, క్షేత్ర 96.6, రోహన్ 96, అశ్వక్ 94.09, ఒమేశ్వర్ 92.21, శ్రీహరి 90 శాతం మార్కులు సాధించినట్లు వివరించారు. వీరంతా పాఠశాల విద్య కూడా ఎస్‌ఆర్ సంస్థల్లోనే పూర్తిచేసినట్లు వివరించారు. సంవత్సరం వృథా కాకుండా, లాంగ్‌టర్మ్ కోచింగ్ లేకుండా ఇంటర్ పూర్తికాగానే జేఈఈ మెయిన్స్‌లో సీట్లు సాధించారన్నారు. ఎన్ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధూకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, ప్రిన్సిపాళ్లు నాగార్జునరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. ఇందుకు అధ్యాపకులు ఎంతో కృషిచేశారని వెల్లడించారు.

సివిల్ సర్వీసెస్ లక్ష్యం..

- గడ్డం రాజీవ్, ఎస్సార్ విద్యార్థి



పాఠశాల విద్యాభ్యాసం, కళాశాల విద్యాభ్యాసం ఎస్‌ఆర్‌లోనే జరిగింది. అధ్యాపకులు చదువు పట్ల విద్యార్థులకు అర్థమయ్యే కోణంలో వివరిస్తారు. మా ఇన్‌చార్జి తిరుపతి అధ్యాపకుల కృషితోనే 99.20 శాతం మార్కులు సాధించా. సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా కష్టపడుతా.

‘అల్ఫోర్స్’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఐఐటీ–జేఈఈ(మెయిన్స్)–2024 మొదటి విడత పరీక్ష ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఫలితాలు మంగళవారం విడుదలవగా కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. బి.ఆదిత్యారావు 99.85, జి.శ్రీహాస్ 99.74, సుబోధ్ చౌదరి 99.59, ఎం.శ్రీరామ్ 99.42, ప్రణీత్ 99.20, నిఖిల్ చోప్రా 99.08, ఎ.శివవరుణ్ 99.05, సీహెచ్.అనూహ్య 98.99, పి.రఘువీరారెడ్డి 98.96, ఎస్.సత్యఅమూల్య 98.95, విశాల్ రెడ్డి 98.94, షఫీక్ 98.94, శివశంకర వరప్రసాద్ 98.91, శ్రీనిధి 98.83, ఎం.ప్రహర్ష 98.83, కె.పునీత్‌మనోహర్ 98.83, రవిచంద్ర 98.42, ఎ.కార్తీక్ 98.19 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. అనేకమంది విద్యార్థులు 90, ఆపై పర్సంటైల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు.

‘ఎస్‌వీజేసీ’ విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కరీంనగర్: నగరంలోని ఎస్‌వీజేసీ జూనియర్ కళాశాలకు చెందిన జి.సాత్విక్ జేఈఈ మెయిన్స్‌లో 90.8 పర్సంటైల్‌తో విజయకేతనం ఎగురవేశాడని చైర్మన్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. పలువురు విద్యార్థులు 85, 81, 79, 77 పర్సంటైల్ సాధించారన్నారు. వారిని చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్ రెడ్డి అభినందించారు.

‘పారమిత’ విజయదుందుబి



కృష్ణతేజ



ఎం.దినేశ్‌రెడ్డి



జి.మనస్విని

కరీంనగర్: నగరంలోని పద్మనగర్ పారమిత విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో విజయదుందుబి మోగించారు. నర్మల కృష్ణతేజ 98.63, ఎం.దినేశ్‌రెడ్డి 96.79, జి.మనస్విని 96.47 పర్సంటైల్ సాధించారు. పారమిత–క్షేత్ర కళాశాల నుంచి మొత్తం 79 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 8 మంది 91, ఆపైన పర్సంటైల్ సాధించారని పాఠశాలల చైర్మన్ ఈ.ప్రసాదరావు తెలిపారు. వారిని ఆయనతోపాటు డైరెక్టర్లు రశ్మిత, అనుకర్‌రావు, ప్రసూన, వి.యు.ఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్, సమన్వయకర్త ఆర్.నాగరాజు అభినందించారు.

‘ట్రినిటి’ విద్యార్థుల సత్తా



శ్రీతేజ



వర్షితరాణి

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటి కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. బి.వర్షితరాణి 99.53, వి.శ్రీతేజ 98.49, ఎం.మణితేజ 97.75 పర్సంటైల్ సాధించారు. వీరే కాకుండా చాలామంది విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ సాధించారని కళాశాలల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

ఇటుక బట్టీలో 100 టన్నుల బొగ్గు పట్టివేత



ఇటుక బట్టీలో అక్రమంగా నిల్వ ఉన్న బొగ్గు

మంథని: మంథని–గోదావరిఖని ప్రధాన రహదారిలోని నాగారం– కన్నాల గ్రామ శివారులో గల ఇటుక బట్టీకి అక్రమంగా బొగ్గు తరలిస్తున్నారనే సమాచారం మేరకు సింగరేణి విజిలెన్స్ అధికారులు తనిఖీలు మంగళవారం నిర్వహించారు. కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేటీకే ఓసీపీ–3 నుంచి ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ 1కు బొగ్గు రవాణా జరుగుతోంది. ఆ బొగ్గును పూర్తిగా అన్‌లోడ్ చేయకుండా సుమారు 11 టన్నుల బొగ్గును రెండు లారీల్లో ఇటుక బట్టీకి తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నట్లు ఆర్‌జీ–3 సింగరేణి సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. అలాగే ఇటుక బట్టీలో అక్రమంగా నిల్వ ఉంచిన మరో 100 టన్నుల బొగ్గును పట్టుకున్నామన్నారు. పట్టుకున్న బొగ్గు విలువ సుమారు, రూ.1.65 ఉంటుందన్నారు. ఈ మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అన్‌ఫిట్ మైనింగ్ సిబ్బందికి సుటబుల్ జాబ్



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: మైనింగ్‌స్టాఫ్ కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటానికి ఫలితం లభించింది. గుర్తింపు యూనియన్ యాజమాన్యంతో చర్చించడంతో అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో సేమ్ డిసిగ్నేషన్ ఇచ్చేందుకు యాజమాన్యం ఒప్పుకుందని గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ యూనియన్ కృషితో 18మంది మైనింగ్‌స్టాఫ్‌కు ఈనెల 19న కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో జరిగే మెడికల్ పరీక్షలకు హాజరు కావాలని యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో 2022 ఏప్రిల్ 19న చేసుకున్న ఒప్పందం ప్రకారం వారికి సూటబుల్ జాబ్ ఇవ్వాల్సి ఉండగా, యాజమాన్యం ముందడుగు వేయలేదన్నారు. దీంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేసిన కొత్తగూడెంలో హెడ్డాఫీస్ ముట్టడితో యాజమాన్యం దిగివచ్చిందన్నారు.